ప్రజాశక్తి
శనివారం 26 అక్టోబర్ 2024

అనంతపురం



పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పత్తి సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ డిమాండ్ చేశారు. వారం రోజుల క్రితం క్వింటా పత్తి ఎనిమిదిన్నర వేల రూపాయలు ఉండగా ప్రస్తుతం ఆరు, ఆరున్నర వేల రూపాయలకు పడిపోయిందన్నారు. ప్రభుత్వం రూ. 7,250 మద్దతు ధర ప్రకటించినా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారుల మోసాలు పెరుగుతున్నాయన్నారు. పత్తి పంట గిట్టుబాటు కాకపోవడంతో ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందని అన్నారు. విత్తనాలు, పురుగు మందుల కల్తీ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి బదులు కంపెనీలకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని విమర్శించారు. పెరిగిన పెట్టుబడి ఖర్చులు పత్తి రైతులను అప్పుల్లో ముంచాయన్నారు. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు రాకపోవడంతో పంట దిగుబడి సగానికి పైగా తగ్గిందన్నారు, అమలుచేయని ప్రభుత్వ మద్దతు ధర ప్రకటన రైతులను దగా చేయడానికేనన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి సీఐఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

అంతటా కళకళ... ఇక్కడేమో వెలవెల..!



వరదలొచ్చినా ప్రాజెక్టులు ఖాళీనే..!

తాగు, సాగునీటికి ఇక్కట్లే..

ఈ ఏడాది అంతటా వర్షాలు అధికంగా వచ్చి ప్రాజెక్టులన్నీ కళకళాడుతు ఉన్నాయి. కాని అనంతపురం జిల్లాలోని ప్రాజెక్టుల్లో మాత్రం నీరు నామ మాత్రంగానే ఉండటం గమనార్హం. జిల్లాకు సాగు,తాగునీటిని అందించే నీటి వనరులు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా. ఈ రెండింటి ద్వారా వచ్చే నీళ్లే జిల్లాకు సాగు, తాగునీటిని అందిస్తాయి.. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరందించే తుంగభద్ర డ్యామ్ ఈసారి ఎప్పుడూలేని విధంగా మూడుసార్లు నిండి గేట్లు ఎత్తారు. కాని అనంతపురం జిల్లాకు మాత్రం అదనంగా నీళ్లు రాకపోగా ప్రాజెక్టులు ఖాళీగానున్నాయి. శ్రీశైలం డ్యామ్ కూడా రెండుసార్లు నిండినప్పటికీ హంద్రీనీవా ద్వారా వస్తున్న నీళ్లు నామ మాత్రమే.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రధాన

పాజెక్టులు వెలవెల

జిల్లాలోనున్న ప్రధాన ప్రాజెక్టులు పిఎబిఆర్, మిడ్‌పెన్నార్. ఈ రెండు ప్రాజెక్టులు మాత్రం ఇప్పటికీ నిండలేదు. పిఎబిఆర్ డ్యామ్ సామర్థ్యం 11 టిఎంసిలు. అయితే నిర్మాణలోపాలతో ఐదు టిఎంసిల వరకు మాత్రమే నిలువ ఉంచుతారు. ఈ ఐదు టిఎంసిలు కూడా ఇప్పటికి రాలేదు. ఇప్పటి వరకు 2.688 టిఎంసిల నీళ్లు మాత్రమే ప్రస్తుతం నిలువ ఉన్నాయి. మిడ్‌పెన్నార్ రిజర్వాయరు నిలువ సామర్థ్యం 5.170 టిఎంసిలయితే కేవలం 1.88 టిఎంసిలు మాత్రమే నీరు నిలువ ఉన్నాయి. దీని కిందనున్న చాగళ్లు బ్యాలెన్సింగు రిజర్వాయరు 1.50 టిఎంసిల నిలువ సామర్థ్యమయితే 0.850 టిఎంసిలు నిలువ ఉన్నాయి. ముచ్చుకోట రిజర్వాయరు, సుబ్బరాయసాగర్ రిజర్వాయరు ఖాళీగానే ఉన్నాయి. హంద్రీనీవా ద్వారా వచ్చే జీడిపల్లి కూడా అదే రకంగా పూర్తి సామర్థ్యంతో లేకపోవడం గమనార్హం.

ప్రధాన కాలువ నిర్వహణ లోపాలతోనే సమస్య

జిల్లాకు సాగునీటిని అందించే ప్రధాన కాలువలు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా రెండూ నిర్వహణ లోపాలతో అధ్వాన్నంగా ఉన్నాయి. తుంగభద్ర డ్యామ్ నుంచి ఎగువప్రధాన కాలువ ద్వారా నీటిని అందించే ఈ కాలువ ద్వారా ప్రస్తుతం 1800 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లాకు 13 టిఎంసిల నీరు వచ్చినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ నీళ్ల వినియోగం ఎక్కడ జరిగిందో తెలియడం లేదు. ఇప్పటికీ ప్రాజెక్టుల్లో పూర్తి సామర్థ్యంతో నీళ్లు మాత్రం రాలేదు. హంద్రీనీవా ద్వారా రావాల్సిన నీళ్లు కూడా నామ మాత్రంగానే వస్తున్నాయి. దీంతో జీడిపల్లి రిజర్వాయరు కూడా పూర్తి సామర్థ్యంతో నిండలేదు. ప్రాజెక్టులన్నీ చాలా వరకు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

ప్రాజెక్టుల నిర్వహణకు తక్షణం నిధులు విడుదల చేయాలి



రాష్ట్రమంతటా ఒకవైపు వర్షాలు ముంచెత్తిపా జిల్లాలో ప్రాజెక్టులు మాత్రం వెలవెల బోతున్నాయి. దీనికి ప్రధాన లోపం పాలకులదే. నీటిని అందించే కాలువల నిర్వహణ పూర్తి స్థాయిలో అధ్వాన్నంగా ఉన్నాయి. ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు బస్సుయాత్ర చేపట్టాం. ఈ యాత్రలోనూ ఈ లోపాలను పరిశీలించడమే కాకుండా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఆచరణలో ఇప్పుడు అదే కనిపిస్తోంది. వర్షాలొచ్చినా ప్రాజెక్టుల్లో మాత్రం నీళ్లు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాలి. నిధులు కేటాయించాలి.

వి.రాంభూపాల్ ,
సిపిఎం జిల్లా కార్యదర్శి



పిఎబిఆర్‌లో అరకొరగా ఉన్న నీరు



హంద్రీనీవా కాలువలో తక్కువ వేగంతో వస్తున్న నీరు

సమగ్ర ఉచిత పంటలబీమా అమలు చేయాలి

ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో సమగ్ర ఉచిత పంటలబీమా అమలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024 రబీ, 2025 ఖరీఫ్, రబీ సీజన్లకు కొత్త పంటలబీమా విధానం ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటలబీమా కొత్త విధానం రైతులపై భారం వేసే ప్రక్రియ అని అన్నారు. ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అవకాశం కల్పించడం ద్వారా వాటికి లాభందాయకంగాను, రైతులకు నష్టదాయకంగాను ఉంటుందన్నారు. గత పదేళ్ల అనుభవం ఈ విషయాన్ని తెలియజేస్తుందన్నారు. ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ఉచిత పంటలబీమా విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల భాగస్వామ్యం పేరుతో రైతులపై భారం వేసే విధానాన్ని మానుకోవాలన్నారు. గతంలో బ్యాంకులో పంటల రుణం తీసుకునే రైతులకు ఇన్సూరెన్స్ ప్రీమియం రుణం మొత్తం నుండి మినహాయించుకొని రైతుల వాటా బ్యాంకులు చెల్లించే విధానం అమలులో ఉండేదన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రతిపాదించిన విధానంలో రైతులే పప్పు శనగ హెక్టారుకు 1125 రూపాయలు, వేరుశనగకు 1200 రూపాయలు, వరికి 1575 రూపాయలు, మొక్కజొన్నకు 1313, టమోటాకు 4 వేల రూపాయలు బీమా ప్రీమియం చెల్లించాలని ప్రకటించడంతో దిక్కుతోచని పరిస్థితిలో అన్నదాతలు ఉన్నారన్నారు బ్యాంకులు గాని ప్రభుత్వం కానీ బీమా ప్రీమియం చెల్లించకుండా రైతుల మీదే భారం వేయడం రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల బీమా విధానంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా లో భాగంగా ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభాలు తప్ప రైతుల ప్రయోజనాలు ఏ మాత్రం పట్టవన్నారు. ప్రభుత్వ ఇన్సూరెన్స్ కంపెనీలను మాత్రమే పంటలబీమా లో భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి రైతులకు లాభదాయకమైన సమగ్ర ఉచిత పంటల బీమా విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు.

శ్మశానవాటిక దారి సమస్య పరిష్కరించాలి

కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేష్, ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయదుర్గం మండలం ఆదిగానిపల్లి గ్రామంలోని దళితుల శ్మశానికి దారి సమస్యను పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేష్, ఓ.నల్లప్ప శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లు దాటినా దళితుల శ్మశానాలకు దారి సమస్యలు ఉండటం బాధాకరమన్నారు. ఆదిగానిపల్లి గ్రామంలో 30 దళిత కుటుంబాలు ఉండగా ఎవరైనా చనిపోతే పూడ్చుకోవానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు అధికారులు, పాలకులకు గ్రామ దళితులు విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. స్వతంత్ర భారతంలో కనీసం చనిపోయినప్పుడు పూడ్చుకోవాలంటే కూడా ఇబ్బందులు పడటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆదిగానిపల్లి గ్రామ దళితుల శ్మశానం దారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామంలోని దళితులను కలుపుకుని ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పశుగణన సకాలంలో పూర్తి చేయాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - అనంతపురం

21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం అనంతపురం జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోనిమినీ కాన్ఫరెన్స్ హాల్లో 21 వ అఖిలభారత పశు గణనకు సంబంధించిన గోడపత్రాలు, బ్రోచర్లు, స్టిక్కర్లు, సూచన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ21వ అఖిలభారత పశు గణన అక్టోబర్ 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలన్నారు. జిల్లాలో 6.20 లక్షల కుటుంబాలు ఉన్నట్లు అంచనా వేశామన్నారు. పట్టణ ప్రాంతాలలో 3వేల ఇండ్లకు, గ్రామీణ ప్రాంతాలలో 2వేల ఇండ్లకు ఒక ఇనుమేరేటర్‌ను నియమించడం జరిగిందని, జిల్లాలోని 31 మండలాలలో 493 పల్లెలలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి పశుగణన చేపట్టేందుకు అధికారులు సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పశు గణనలో భాగంగా గణన ప్రక్రియ పూర్తయినట్లు చిహ్నంగా ప్రతి ఇంటి ముందు తలుపు కుడి ఎగువ మూలలో స్టిక్కర్లు అతికించాలని తెలిపారు. ఈ పశుగణన ద్వారా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలతోపాటు వివిధ రకాల కోళ్లు పక్షులతో సహా 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీగా సమాచారాన్ని సేకరించాలన్నారు. ఈ గణన ప్రక్రియ పశు సంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడేలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, అగ్రికల్చర్ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ డిడి రమేష్ రెడ్డి, ఏడీలు శ్రీలక్ష్మి రాధిక, విఎల్ఒ రంగారెడ్డి, పశు సంవర్ధకశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

ఎంపి అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లోని నివసిస్తున్న నిరుపేదల తయారు చేసిన వస్తువులను ప్రతినెలలో మున్సిపల్ కార్యాలయం ముందు ప్రదర్శనగా ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టి మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడనున్నట్లు దోహదపడుతుందని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ – మెప్మా ఆధ్వర్యంలో నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణం బయట ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో నగరం మరియు పట్టణ ప్రాంతాల్లోని నివసిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను ఇంటి వద్ద తక్కువ పెట్టుబడితో మంచి వస్తువులు నాణ్యతగా తయారు చేస్తారన్నారు. మహిళలు ఆర్థిక అభివద్ధి చెందడానికి ఈ కార్యక్రమం ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో తానే వస్తువులను కొని ఉపయోగిస్తానని, ప్రతి ఒక్కరూ మెప్మా సభ్యులు చేసినటువంటి ఉత్పత్తులను కొనాలని తెలియజేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందడానికి అర్బన్ మార్కెట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను అర్బన్ మార్కెట్లో విక్రయించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, మెప్మా పిడి విశ్వజ్యోతి, మెప్మా సిబ్బంది, మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

గ్రామంలో నీటి వ్యధ ..కార్యాలయాల్లో వృథా



తహశీల్దార్ కార్యాలయంలో వృథాగా పోతోన్న నీరు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలో నీటిఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు తహశీల్దార్ కార్యాలయంలో నీరు వృథాగా పోతోంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో తాత్కాలిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ భవనాలకు పక్కనే విద్యాధికారి కార్యాలయం ఉంది. కార్యాలయాలకు ఉన్న నీటిట్యాంకులను నింపే నీటి లైన్‌పైప్ శుక్రవారం ఉదయం తెగిపోవడంతో క్రీడా మైదానంలో నీరు వృథాగా పోతోంది. పాఠశాలకు వచ్చిన పిల్లలు గుర్తించడంతో అక్కడే ఉన్న యువకులు అతి కష్టం మీద పైపులను అతికించి నీటి వృథాను అరికట్టారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసుల ఆయుధాలపై

విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలి

జిల్లా ఎస్పీ పి.జగదీష్



పోలీసు జాగిలంతో కరచాలనం చేస్తున్న విద్యార్థిని

ప్రజాశక్తి - అనంతపురం క్రైం

పోలీసు విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాల పట్ల విద్యార్థి దశ నుండే అవగాహన కల్గి ఉండటం మంచిదని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని షాదీఖానాలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ప్రదర్శనలో ఉంచారు. సుశిక్షితులైన సిబ్బందిచే సందర్శనకు విచ్చేసిన ప్రజలకు ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. ఏ సందర్భంలో ఎలాంటి ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి పనితీరు గురించి ఈసందర్భంగా విద్యార్థులకు ఎస్పీ అవగాహన కల్పించారు.

ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు....

22 రైఫిల్ , 410 మస్కెట్ , 303 రైఫిల్ , 762 ఎం.ఎం ఎస్–ఎల్ఆర్, ఏ.కే 47, 5.56 ఎంఎం (ఇన్సాస్), 9 ఎంఎం. కార్బైన్ , 38 రివాల్వర్ , 9 ఎంఎం పిస్టోల్ , 9 ఎంఎం గ్లాక్, విఎల్ పిస్టోల్ , ప్రొజెక్టర్ పైరోటెక్ , 12 బోర్ పంప్ యాక్షన్ గన్ , ఎల్ఎంజి, 51 ఎంఎం మోటారు, హెచ్ఇ 36 గ్రనేడ్ , యాంటీ రైట్ గన్స్ , గ్యాస్ గన్ , రోబోటెక్ (బాడీ ప్రొటెక్టర్) , సేవాదళ్ డ్రస్ , ఫైబర్ లాఠీ, బాడీ ప్రొటెక్టర్ , స్టోన్ గార్డు, హెల్మెట్ , కేన్ లాఠీ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ హెవీ, మీడియం, లైట్ డే, నైట్ విజన్ బైనాక్యూలర్లు, జిపిఎస్ , మెగాఫోన్ , లెటర్ బాంబు డిటెక్టర్, డిఎస్ఎండి, నార్కో డిటెక్షన్ కిట్ తదితర వాటితో పాటు వజ్ర వాహనాలు, డాగ్ బృందాలను ప్రదర్శనలో ఉంచారు. ఈకార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, త్రీటౌన్ సిఐ శాంతిలాల్ , ఆర్ఐలు రెడ్డెప్పరెడ్డి, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్ , ఆనంద్, పలువురు ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, నగరంలోని పలు విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో ఎమ్మెల్యే దగ్గుపాటి భేటీ



మంత్రికి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్ : అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టీజీ భరత్‌ను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శుక్రవారం కర్నూలులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా అర్బన్ నియోజకవర్గంతో పాటు పలు అంశాల గురించి చర్చించారు. ముఖ్యంగా జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. నగరం చుట్టుపక్కల పరిశ్రమలు వస్తే వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుపై కూడా చర్చించారు. చిన్న, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎఎన్ఎం కోర్సులో ప్రవేశానికి గడువు పొడిగింపు

అనంతపురం : అనంతపురం ఎంపిహెచ్‌డబ్ల్యు మహిళల ట్రైనింగ్ స్కూల్‌లో ఎఎన్ఎం కోర్సులో ప్రవేశానికి ఈనెల 31వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాలో 216 మంది ఎంపిక


రాయదుర్గం రూరల్ : కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 216 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో సుమారు వెయ్యిమంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రఘురామ మూర్తి, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

సొంత గూటికి కార్పొరేటర్

టిడిపి కండువా వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని 44వ డివిజన్ కార్పొరేటర్ శాంతిసుధ సొంతగూటికి చేరారు. ఇందులో భాగంగా కార్పొరేటర్‌తోపాటు భర్త మధుసూదన్‌గౌడ్ కలిసి సుమారు 150మందితో శుక్రవారం టిడిపిలో చేరారు. వీరికి అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కార్పొరేటర్ శాంతిసుధ మాట్లాడుతూ గతంలో తాము అనుకోని కారణాల వల్ల పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. అయితే టిడిపి నుంచి బయటకు వచ్చాక కూడా తాము ఏ పార్టీలో చేరకుండా ఇండిపెండెంట్‌గా పోటీ చేశానన్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి చేస్తున్న అభివృద్ధి చేసి ఆయన పక్కన ఉండాలనుకుని టిడిపిలో చేరుతున్నట్లు వివరించారు. మమ్మల్ని మళ్లీ పార్టీలోకి ఆహ్వానించినందుకు ఎమ్మెల్యేకు, అధిష్టానానికి రుణపడి ఉంటామన్నారు. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేటర్ శాంతిసుధకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు.



టిడిపిలోకి చేరిన వారితో ఎమ్మెల్యే దగ్గుపాటి, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్

కూలీలకు 'ఉపాధి' పనులు కల్పించాలి : సిపిఎం



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని వ్యవసాయ కూలీలు, రైతులకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని సిపిఎం నాయకులు అమ్మలదిన్నె కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శకుంతలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయం లేక రైతులు, కూలీలు వలసలు వెళ్తున్నారన్నారు. పక్క జిల్లాలకు వలసలు వెళ్తుండటంతో ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం. కావున తక్షణం అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వలసలను నివారించాలని కోరారు. అలాగే ఉపాధి పనులు చేసే చోట మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు దేవేంద్రారెడ్డి, పప్పూరు కొండయ్య, వెంకటనారాయణ, గోగుల రాముడు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన



అగ్గితో ప్రదర్శన చేస్తున్న జెవివి నాయకుడు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని రజాపురం గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో శాస్త్రీయ విజ్ఞానంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా జెవిని నాయకులు గాజు పెంకుల పైన నడవడం, ఆత్మలింగాలు సష్టించడం, మంచినీటిని మండించడం, వెలుగుతున్న కర్పూరాన్ని మింగడం, నాలుకకు దబ్బనం కుచ్చుకోవడం, శూన్యంలో విభూతి సృష్టించడం తదితర ప్రదర్శనలు చేశారు. ఆయా ప్రదర్శనల వెనక ఉన్న సైన్స్‌ను వివరించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. హరిప్రసాద్ మాట్లాడుతూ మానవుని నిస్వార్థ సేవలే జీవితానికి ప్రామాణికంగా గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవిఆర్.విజయ, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయినిలు నాగ సులోచన, నాగమణి, చంద్రకళ,పుష్పలత, శశికళ, నళినికుమారి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

24న ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-తాడిపత్రి

పదవ తరగతి, ఇంటర్ 2023-24 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు నవంబర్ 24న జయమనెమ్మ కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేయనున్నట్లు నాయీబ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. శుక్రవారం పట్టణం లోని నాయీబ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌బాబు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 480, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు 520, ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల్లో 850, ప్రయివేట్ కళాశాలల్లో 900 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు అర్హులు అన్నారు. నవంబర్ 15వ తేదీలోపు సెల్..9963032014 నెంబర్‌కు దరఖాస్తులను పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నాయకులు శంకర్‌నారాయణ, రమణ, గిరి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ నందకిషోర్

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఎంపిడిఒ నందకిశోర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సూగేపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తర్వాత కూలడానికి సిద్ధంగా ఉన్న నంజాపురం, వర్షం కారణంగా కారుతున్న యనకల్లు, గుడిపల్లి, కన్నేపల్లి, సూగేపల్లి, వేపులపర్తి సెక్టార్ పరిధిలో ఉన్న ఎరిడికెర, భైరవానితిప్ప, చెలిమేపల్లి, పొబ్బర్లపల్లి అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ సెంటర్ల భౌతిక స్థితి, రికార్డులు పరిశీలన, హాజరు, పౌష్టికాహార పంపిణీ, బాల సంజీవిని తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బహ్మసముద్రం సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ కాసింబీ, వేపులపర్తి సూపర్‌వైజర్ రామాంజినమ్మ, పిఆర్ జెఇ విజయ్‌కృష్ణ, సర్పంచి వనిత మల్లికార్జున, అంగన్వాడీ కార్యకర్త శాంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో కళ్యాణదుర్గాన్ని చరిత్రలో నిలపాలి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



క్రీడాకారులతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆటల్లో కళ్యాణదుర్గాన్ని చరిత్రలో నిలపాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం హాకీ క్లబ్ నాయకులు, క్రీడాకారులు ఎమ్మెల్యే అమిలినేనిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా నియోజవర్గంలో క్రీడల అభివృద్ధి గురించి, హాకీ విశిష్టతపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో నిర్వహించే క్రీడా పోటీలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం హాకీ క్లబ్ ప్రెసిడెంట్ రాజు, మారెమ్మపల్లి హాకీ క్లబ్ ప్రెసిడెంట్ రావనేపల్లి బాబు, ట్రెజరర్ బిర్యాని సెంటర్ రఘు, జాతీయ క్రీడాకారుడు శివ, హాకీ కోచ్ అక్రం, కళ్యాణదుర్గం సీనియర్ హాకీ క్రీడాకారులు అరవింద్, అఖిలా, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

తాడిపత్రి : ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ శివరామకృష్ణ సూచించారు. శుక్రవారం పట్టణంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ వైస్‌ఛైర్మన్ అబ్దుల్ రహీంతో కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తాడిపత్రి మున్సిపాలిటీలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ తాడిపత్రిని చేద్దామని పిలుపునిచ్చారు.

వంతెన పనులు ప్రారంభం

బ్రహ్మసముద్రం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిన సూగేపల్లి-కోనాపురం వంతెన పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి వనిత మల్లికార్జున, ఎంపిడిఒ నందకిశోర్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన వతెన పనులు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఇంజినీర్ విజయ్‌కృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లలిత, మాజీ ఎంపిటిసి కరేగౌడ, స్కూల్ కమిటీ ఛైర్మన్ కరేగౌడ, డీలర్ నల్లమల్ల సీనప్ప, నాయకులు పెంకులు మల్లికార్జున, అక్కన్న, దండు తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన

గుత్తి : పట్టణంలోని రైతు సేవాకేంద్రంలో ఎడిఎ ఎం.వెంకటరాముడు ఆధ్వర్యంలో శుక్రవారం పంటలపై సస్యరక్షణ, చీడపీడల నివారణపై వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఆత్మ పీడీ మద్దిలేటి హాజరయ్యి క్రాఫ్ట్ లైఫ్ సిస్టం, పీడీఎస్ఎస్ యాప్ ప్రాముఖ్యతను వివరించారు. వేరుశనగ, పత్తి, కంది, సజ్జ పంటలపై సస్యరక్షణ తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ పి.జగదీష్



పోటీలకు హాజరైన విద్యార్థినులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర'అనే అంశంపై వ్యాసరచన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి సమాజం నిర్మించడంలో విద్యార్థుల, యువత పాత్ర కీలకమైందన్నారు. క్రమశిక్షణతో చదవడమే కాకుండా సత్ప్రవర్తనతో తల్లిదండ్రుల ఆశయాలకు చేరువ కావాలన్నారు. చెడును దూరం చేసుకుని మంచికి బాటలు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, త్రీటౌన్ సిఐ శాంతిలాల్, ఆర్ఐలు రెడ్డెప్పరెడ్డి, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, ఆనంద్, లక్ష్మీనారాయణ, ఆర్ఎస్ఐలు మగ్బూల్, జాఫర్, రమేష్‌నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు : పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు వినియోగించే ఆయుధాలపై ఎస్ఐ హేమాద్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏఏ విభాగాలు ఉంటాయి.. వారి ర్యాంకులు, స్థాయి వంటి విషయాలను మండల కేంద్రంలోని కెజిబివి విద్యార్థినులకు వివరించారు. అలాగే స్వయంగా విద్యార్థినులతో వాకీటాకీలో జిల్లాలోని కమాండ్ కంట్రోల్‌తో మాట్లాడించారు. అలాగే గన్, సెల్, బేడీలు, తదితర వాటిపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిఐ సత్యబాబు, ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీరామప్రసాద్ శుక్రవారం స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలు, ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా కమాండ్, కంట్రోల్ వాకీటాకీ, గన్, సెల్, బేడీలు తదితర వాటిపై వివరించారు. అనంతరం విద్యార్థులు మొబైల్, టెలివిజన్, సోషల్ మీడియా గేమింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని దళితుల ధర్నా



ధర్నా చేస్తున్న బాధిత దళితులు

ప్రజాశక్తి-శింగనమల

'ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నాం.. మాకు తెలియకుండా మా ఇంటిని ఓ విఆర్ఎ పట్టా చేయించుకున్నాడు.. న్యాయం చేయాలి' అంటూ మండలంలోని శివపురానికి చెందిన పలువురు దళితులు వేడుకున్నారు. ఇళ్ల పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ చక్రాయపేట గ్రామ పొలంలోని సర్వేనెంబర్ 531లో శివపురం గ్రామానికి చెందిన తలారి తిరుపాల్‌కు 2.17ఎకరాల భూమి ఉంది. అయితే ఈ భూమిలో శివపురం గ్రామానికి చెందిన 17 మంది వారికి కావాల్సిన భూమిని సెంట్ల రూపంలో ఎవరికి కావాల్సిన భూమిని వారు కొనుక్కుని అగ్రిమెంట్ చేయించుకోవడంతోపాటు ప్రభుత్వ పక్కాగృహాలను నిర్మించుకున్నారు. ఈనేపథ్యంలో రెవెన్యూ అధికారుల అండదండలతో దళితుల ఇళ్ల స్థలాలతోపాటు శ్మశాన స్థలాన్ని కూడా బండమీదపల్లి విఆర్ఎ ఓబుళపతి తన భార్య మన్నెపాకుల లక్ష్మిపేరుపై సర్వేనెంబర్ 531-1లో ఉన్న 2.17 సెంట్లు భూమికి పట్టా తీసుకున్నాడని వాపోయారు. తమకు న్యాయం చేయాలని చాలా రోజుల నుంచి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. చేసేదిలేక ధర్నాకు దిగినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు నారాయణస్వామి, సన్నాగప్ప, చంద్ర, చిన్నఎర్రప్ప, శివయ్య, నగేష్, రామాంజి, బాలనాగన్న, కిష్టయ్య, రామాంజనేయులు, బాలకుళ్లాయప్ప, చిన్నపెద్దన్న, ఏర్నాగప్ప, చిన్న నల్లప్ప, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఎంపిపి-2 రంగయ్య మృతిచెందడంతో మౌనం పాటించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో 23,456 ఎకరాలకు క్రాప్ బుకింగ్ చేసుకున్నారన్నారు. అలాగే రైతులే బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించుకోవాలని సూచించారు. అలాగే మండలంలోని దుగ్గుపల్లి, కూచివారిపల్లి, పెద్దమల్లేపల్లి, తదితర పాఠశాలల్లో పాఠశాలల భవనాలు దెబ్బతిన్నాయని మండల విద్యాధికారి సభ దృష్టికి తీసుకొచ్చారు. వీరితోపాటు ఆయా శాఖ అధికారులు వారి పరిధిలోని సమస్యలు, చేసిన పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ సుప్రజ, ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ శేషారెడ్డి, జడ్పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్‌బాబు, ఎంఇఒ చంద్రశేఖర్, ఎపిఒ షబ్బీర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజామణి, పంచాయతీ ఇంజినీర్ నరేంద్ర, ఆర్‌డబ్ల్యుసి ఇంజినీర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

యల్లనూరు : ఇటీవల మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచి గౌస్‌బీ(80) కుటుంబ సభ్యులను వైసిపి నేత ఆలూరు సాంబశివారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇందులో భాగంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, గొడ్డుమర్రి ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఒత్తిడి తీసుకురావాలని వినతి

కళ్యాణదుర్గం రూరల్ : త్వరలో జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మాణం చేసేలా ఒత్తిడి తీసుకురావాలని ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సాకే గురుమూర్తి, నాయకులు కనుకూరు ఎన్ఆర్.శివ, పిల్లలపల్లి అనిల్, పిఎస్.చాంద్‌బాషా, ఆనంపల్లి రామన్న, కృష్ణాపురం బాబు, మారన్న, యాటకల్లు రామమూర్తి, చెర్లోపల్లి వెంకటేష్, మైలారి, చెలిమప్ప, నిజవళ్లి హరీష్, తిప్పేస్వామి, బొట్టువానపల్లి తిప్పేస్వామి, అనపల్లి పాలాక్షి, ములకలేడు మనోజ్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు ఉరవకొండ విద్యార్థినులు

ఉరవకొండ : రాష్ట్రస్థాయి షటిల్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్‌కు ఉరవకొండ జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులు హిమబిందు, విజయలక్ష్మి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు డేవిడ్ కిరణ్, మారుతీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయికి ఎన్నిక కావడంతో క్రీడాకారులతోపాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు హనీఫ్, పద్మావతి అభినందనలు తెలిపారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

బాధితురాలికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

కళ్యాణదుర్గం రూరల్ : ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితురాలికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ శుక్రవారం ఆర్థికసాయం అందించారు. తోపుడు బండిలో పండ్ల వ్యాపారం చేసుకునే పట్టణానికి చెందిన వన్నూరుబీని ఇటీవల గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వెన్నెముకతోపాటు కాళ్లు విరిగాయి. దీంతో ప్రాణాప్రాయ స్థితిలో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ రూ.20వేల ఆర్థికసాయాన్ని బంధువులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్‌ఛైర్మన్ సురేష్, కార్యదర్శి హరీష్, ట్రెజరర్ అబ్దుల్‌వాహబ్, సభ్యులు లోకేష్, తిప్పేస్వామి, యువకులు సాయినాథ్, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి చేయూత

యాడికి : మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమతోపాటు చదుకున్న బాధిత స్నేహితుడికి శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. 2002లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల్లో ఒకరు మండల కేంద్రంలోని ఆసుపత్రి కాలనీలో నివాసం ఉంటున్న గూండా నాగరాజు కుటుంబంలోని ముగ్గురికి పక్షవాతం వచ్చింది. ఈ విషయం వివిధ పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన పూర్వ విద్యార్థులు రూ.10వేలు అందజేశారు. అలాగే యల్లనూరు మండలానికి చెందిన తలారి ప్రణతి వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేలు నాగరాజు కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుండా నారాయణస్వామి, విశ్వనాథ్, సురేష్, జనార్ధన్, చాంద్‌బాషా, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

యాడికి : మండల పరిధిలోని నిట్టూరు, బోయరెడ్డిపల్లి గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై తాడిపత్రి మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి తొట్లలోని నీటిని పారబోసి ఆరబెట్టుకోవాలన్నారు. అనంతరం నిట్టూరు సబ్‌సెంటర్‌లోని రికార్డులను తనిఖీ చేసి, గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పి హర్షిత, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

మినీగోకులాల నిర్మాణానికి భూమిపూజ

గార్లదిన్నె : జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో చిన్న సన్నకారు రైతులకు పశువుల షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ గోకులాలకు ఎంపిడిఒ యోగానందరెడ్డి గార్లదిన్నెకు చెందిన రైతు గోవిందరెడ్డి పొలంలో శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్లు మంజూరైన రైతులందరూ త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి దామోదరమ్మ, ఎపిఒ నాంచారమ్మ, ఇంజినీర్ విజయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

అనంతపురం : నగరంలోని జీసెస్‌నగర్‌లో ఉన్న పవర్ ఆఫీసు ఎదురుగా హర్ష ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా చట్ట విరుద్ధంగా ఇళ్లలో ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తుండటంతో జరిమానా విధించారు. మూడు సిలిండర్లను సీజ్ చేశారు. అనంతరం హోటల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో అధికారులు పి.ఫణీంద్రనాథ్‌రెడ్డి, జె.వాసుప్రకష్, బి.సురేష్‌కుమార్, కె.నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి

గుత్తి : వాల్మీకుల ఆరాధ్య దైవం వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వాల్మీకి, బోయ సంక్షేమ సంఘం నాయకులు బోయ వేణుగోపాల్, పి.సుధాకర్, వాసు కోరారు. ఈమేరకు శుక్రవారం వాల్మీకి బోయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి ఆది కవిగా గుర్తింపు పొందారన్నారు. సర్వమానవాళికి నీతి ధర్మాలను తెలియజేస్తూ రామాయణాన్ని రచించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచిలు వెంకటరాముడు, సుంకన్న, వాల్మీకి బోయ సంక్షేమ సంఘం నాయకులు డేగ మద్దిలేటి, తిమ్మప్ప, న్యాయవాది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

బెలుగుప్ప : పండ్ల తోటలుసాగు చేసిన రైతులు చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గంగవరం గ్రామంలో పర్యటించి రైతుల సాగు చేసిన పండ్ల తోటలు, బంతిపూల తోటలను పరిశీలించారు. ఇందులో భాగంగా ఉద్యానశాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమలు చేసే వివిధ పథకాలను వివరించారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు

వలసలను నివారించాలి

బుక్కరాయసముద్రం : కూలీలందరికీ గ్రామాల్లోనే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వలసలను నివారించాలని డ్వామా పథకం సంచాలకులు సలీంబాషా సూచించారు. శుక్రవారం మండలంలోని దండువారిపల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫారంపాండ్‌తోపాటు దయ్యాలకుంటపల్లిలో చేపట్టిన మినీఅమృత్ సరోవర్ పనులను పరిశృలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజులు పని కల్పించాలన్నారు. అలాగే పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించి మొక్కలు నాటే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ పోలేరయ్య, సాంకేతిక సహాయకుడు కృష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

'పశుగణన' పోస్టర్లు విడుదల

ఉరవకొండ : మండల పరిధిలోని లత్తవరం గ్రామ పంచాయతీలో మాజీ సర్పంచి బోధపాటి గోవిందు, వైస్ సర్పంచి వంకలపాటి లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పశుసంవర్ధ సహాయకులు లావణ్యబాయి ఇంటింటికీ వెళ్లి పశువులు, పెంపుడు జంతువుల వివరాలను సేకరించారు. అనంతరం పశువులతో పాటు పెంపుడు జంతువులను పెంచే విధి విధానాలతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పశు గణనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అఖిల భారత పశుగణన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, సర్పంచి పార్వతి, సహాయ సంచాలకులు డాక్టర్ ఎవి.రత్నకుమార్, బుక్కరాయసముద్రం ఇన్‌ఛార్జి పశు వైద్యాధికారి డా. గోవిందరాజు, పశు వైద్య సహాయకులు సరస్వతి, తేజస్విని, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్ : 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసగుప్తా, వైద్యులు మంజునాథ్, రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : పశుసంపద గణనకు వచ్చే యానిమేటర్లకు సమగ్ర సమాచారం అందించి సహకరించాలని పశువైద్యాధికారి సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జనాభా లెక్కల మాదిరిగానే పశువుల సంఖ్యను లెక్కించేందుకు భారత ప్రభుత్వం 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 28వతేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కావున రైతులు సహకరించాలని కోరారు.

బెలుగుప్ప : మండలంలోని బెలుగుప్ప తండాలో అఖిల భారత పశు గణన కార్యక్రమాన్ని సర్పంచి సాలిబాయి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్‌గుప్తా, గంగ్యానాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీబాయి, పశుసంవర్ధక సహాయకులు, వెటర్నరీ అసిస్టెంట్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల కేంద్రంలో పశు వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పశుగణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సిబ్బందికి ఒదుకు సంబంధించిన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఎపిఒ నాంచారమ్మ, ఇఒఆర్‌డి దామోదరమ్మ, ఇంజినీర్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీకి యత్నించిన నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

నార్పల : మండల కేంద్రంలోని కూతలేరు వంక సమీపంలో ఈనెల 18న అర్ధరాత్రి ఎటిఎంను బద్దలుగొట్టి యత్నించిన దొంగలను అందుపులోకి తీసుకున్నట్లు డిఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ కౌలుట్లయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ మండల కేంద్రంలోని క్రాసింగ్ సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఓ మహిళ, నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారన్న సమాచారం మేరకు వెంటనే ఎస్ఐ సాగర్ సిబ్బందితో వెళ్లగా పారిపోయేందుకు యత్నించారన్నారు. వెంబడించి అనంతపురానికి చెందిన బోయ చిన్నబాబు, బోయ సాయిప్రేమ, అనంతపురం కక్కలపల్లి కాలనీకి చెందిన సాకే చిన్న, గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన ఎరికల అంజలి, తాటిచెర్లకు చెందిన గొర్ల శంకర్‌ను అదుపులోకి తసుకున్నట్లు తెలిపారు. నిందితులను విచారింగా జల్సాలకు అలవాటు పడిన వీరు అనంతపురం పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడటం, నిర్మానుష్య ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లడం, ఆటోల సామాన్లను దొంగలించడం, గ్యాస్ సిలిండర్లు ఎత్తుకెళ్లడంతోపాటు చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 18న ఎటిఎం చోరీకి యత్నించారన్నారు. నిందితుల నుంచి ఒక ఆటో, ఐదు ద్విచక్ర వాహనాలు, చోరీలకు ఉపయోగించే పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టులో కీలకపాత్ర పోషించిన ఏఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, దేవకుమార్, వెజిటేబుళ్ల రాఘవేంద్ర, సాకే హరి, అనిల్, అమర్, జగదీష్‌నాయక్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

తండ్రిని హతమార్చిన కొడుకు అరెస్టు

యాడికి : ఈనెల 23న మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపం వెనుక వర లక్ష్మీనారాయణ (48) హత్య కేసులో ఆయన మొదటి భార్య కుమారుడు కార్తీక్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు సిఐ ఈరన్న తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ మృతుడి రెండవ భార్య రమాదేవి ఈనెల 23వ తేదీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తుండగా నిందితుడిని కమలపాడు రోడ్డులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, జమిందార్ రంగనాయకులు, కానిస్టేబుళ్లు హరి, శివశంకర్, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు బైండోవర్

యల్లనూరు : మండల పరిధిలోని చింతకాయమంద గ్రామంలో పొలం తగాదా విషయంలో అదేగ్రామానికి చెందిన నలుగురిపై శుక్రవారం బైండోవర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు స్థానిక తహశిల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ శేషారెడ్డి ముందు హాజరుపరిచినట్లు తెలిపారు.